ప్రజాశక్తి

ఆదివారం 2 నవంబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

గిరిజనుల సంక్షేమానికి కృషి

బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గిరిజనుల సంక్షేమానికి కషి చేస్తామని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు.కలెక్టరేట్ లో జనజాతీయ గౌరవ దివాస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో పర్యటిస్తామన్నారు. గిరిజన ప్రజల సమస్యలను పరిశీలించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. భారతదేశంలో జన జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమాన్ని గిరిజన స్వాతంత్ర సమరయోధుడు బీర్సాముండా జయంతి సందర్భంగా నవంబర్ 1 నుంచి 15 వరకు అనేక కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకు న్నందున గిరిజన స్వాతంత్ర సమర యోధులు బీర్సా ముండా, అల్లూరి సీతారామరాజు, గాము ఘంటాదొర, గాము మల్లదొర బోనంగి పండుపడాల్, కుడుముల పెద్ద బయ్యన్న, హనుమంతప్ప, కారం తమ్మనదొరలను స్మరించుకోవడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. గిరిజన సమస్యలపై బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాటాలపై పోరాటాలు చేసి గిరిజన ప్రజలకు స్వాతంత్రాన్ని ఇచ్చారన్నారు. గిరిజన ప్రజల కష్టాలను తెలుసు కోవడానికి ప్రచారం మాధ్యమాలు లేని రోజుల్లో కొండ ప్రాంతాలకు వెళ్లి గిరిజన ప్రజలను చైతన్యం చేసి బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాటా లు చేశారన్నారు. జిల్లాలో గిరిజన ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్య క్రమాలు చేపడుతుందన్నారు. గిరిజనుల ప్రజల పిల్లలు చదువుకొని తద్వారా అభివద్ధి చెందాలన్నారు. ఉద్యోగ అవకాశాలు పొందాలని చెప్పారు. గిరిజన ప్రజలు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా జీవించాలన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బీర్సాముండా, అల్లూరి సీతారామరాజు, గాము గంటదొర, గ్రాము మల్ల దొర, బోనంగి పండు పడాల్, కుడుముల పెద్ద బయ్యన్న, హనుమంతప్ప, కారం తమ్మన దొర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బి.ప్రకాష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా విద్యా శాఖఅధికారి పురుషోత్తం, సాంఘిక సంక్షేమశాఖఅధికారి రాజ్ దిబోరా, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, వ్యవసాయశాఖ ఏడీ అన్నపూర్ణ, గిరిజన సంఘాల నాయకులు కె.ప్రసాదు, బి. వెంకటేశ్వర్లు, డి.రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

పంట నష్టాన్ని అంచనా వేయాలి

ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి -కంభం రూరల్

మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన పంట నష్టాన్ని అంచనా వేసి, దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. కంభం వరద రాజమ్మ చెరువు అలుగు, బేస్తవారిపేట సమీపం లోని చీతిరాల కత్తువను శనివారం పరిశీలించారు. అనంతరం ముంపునకు గురైన పంటలను పరిశీలించి వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెవిగొండ ప్రాజెక్టు అతిథి గృహంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి గిద్దలూరు నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటల అంచనాలు తయారీ, దెబ్బ తిన్న రోడ్ల పునరుద్ధరణ పనుల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుపాను వల్ల నష్టపోయిన పంటల ఎన్యూమరేషన్‌లో ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకుండా పటి ష్టంగా చేపట్టాలన్నారు. నియోజకవర్గం పరిధిలో దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ▶ 2లో



కంభం చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

జిల్లాల విభజనలోకి ..

రామాయపట్నం రాజకీయం

- పోర్టు కోసం కందుకూరును నెల్లూరులోనే ఉంచేందుకు వ్యూహాలు
- ప్రకాశం జిల్లాలో విలీనం చేయాలని అన్ని పార్టీల పట్టు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

జిల్లాల విభజన ప్రక్రియ ఊపందుకోవడంతో రామాయపట్నం పోర్టు వ్యవహారం రెండు జిల్లాల మధ్య కొత్త చర్చకు తెరలేపింది.పోర్టుపై నెల్లూరు పాలకపక్ష నేతలు రాజకీయం మొదలు పెట్టారు.ఇప్పటి వరకూ సిఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశంలో విలీనం చేస్తారనేదానిపై ఎలాంటి సందేహాలు లేవు. తాజాగా రామాయపట్నం పోర్టు జిల్లాల విభజన ఎజండాలోకి హాట్ టాపిక్‌గా వచ్చింది. పోర్టుతో అనేక ఆర్థిక ప్రయోజనాలు ముడిపడి ఉన్నందున దాన్ని ఏదో రకంగా నెల్లూరు జిల్లాలోనే ఉంచుకునేందుకు ఆ జిల్లా తెలుగుదేశం పార్టీ కీలక నేతలు పావులు కదుపుతున్నారనే చర్చ సాగుతోంది.ఈ నేపథ్యంలో కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. విభజనలో పోర్టు ఏదో రకంగా నెల్లూరు జిల్లాలోనే ఉండేలా వ్యూహాలు నడుపుతున్నారని సమాచారం. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆ జిల్లా డిఆర్‌సిలో తమను ప్రకాశం జిల్లాలో కలపాలని కోరారు. అప్పుడే ఆ జిల్లా మంత్రి ఒకరు స్పందిస్తూ రామాయపట్నం పోర్టును వదిలేసి వెళ్లిపోండంటూ చమత్కారంగా వ్యాఖ్యానించిట్లు సమాచారం. దీంతో ఏదో జరుగుతుందనే అనుమానాలు తెరపైకి వచ్చాయి. కందుకూరు నియోజకవర్గ రాజకీయపార్టీల్లోనూ ఇదే చర్చ వచ్చింది. దీంతో కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశంలోనే విలీనం చేయాలని కోరుతూ అన్నిపార్టీల నేతలు నెల్లూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడం కూడా చర్చకు దారితీస్తోంది. ఈ వినతిపత్రం ఇవ్వడం వెనుక బలమైన కారణాలున్నట్లు చెబుతున్నారు. నెల్లూరు జిల్లా నేతలు అడ్డుకుంటున్నారనే అభిప్రాయం స్పష్టంగా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఆ నియోజకవర్గ పర్యటనల్లోనూ కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశంలో కలుపుతామని హామీ ఇచ్చారు. ఇదే జరుగుతుందని అందరూ ఇప్పటి వరకూ వేచిచూస్తున్నారు. తెరచాటు ఏదో జరుగుతున్నందునే అన్ని పార్టీలు కలెక్టర్‌ను కలిసినట్లు తెలుస్తోంది. అసలు జిల్లాల పునర్విభజన జరిగినపుడు కూడా అప్పటి ఎమ్మెల్యే మానుగుంటమహిధర్ రెడ్డి అన్ని మండలాల ప్రజాప్రతినిధులతో వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కందుకూరును ప్రకాశంలోనే ఉంచాలని కోరారు. అంటే జిల్లాల పునర్విభజన జరిగినప్పుడే కందుకూరుపై అక్కడ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు స్పష్టమైన వైఖరితో ఉన్నారు. నెల్లూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు పోర్టు కోసం కందుకూరును నెల్లూరు జిల్లాలోనే ఉంచే ప్రయత్నాలపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.పైగా పోర్టు కోసం ఆనాడు ఉద్యమించింది ప్రకాశం జిల్లా పార్టీలు. ప్రజానీకం, ప్రజా సంఘాలు. రామాయపట్నం పోర్టు కోసం అనేక పోరాటాలు చేశాయి. 2019 ఎన్నికలకు ముందు అప్పటి ▶ 2లో



ఉత్తమ సేవలకు అవార్డులు



సిఎం నుంచి అవార్డు అందుకుంటున్న మంత్రి స్వామి

తుపానులో ప్రజలకు అండగా నిలిచిన మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని సిఎ చంద్రబాబు నాయుడు ప్రశంసి ంచారు. ఉండవల్లిలోని సిఎ క్యాంపు కార్యాల యంలో మెమొంటో, సర్టిఫికెట్లను సిఎం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని ని అభినందించి ప్రశంసా పత్రం, ఉత్తమ సేవా అవార్డుతో సత్కరించారు.


ప్రజాశక్తి-శింగరాయకొండ



సిఎం నుంచి అవార్డు అందుకుంటున్న ఎమ్మెల్యే దామచర్ల

మొంథా తుపాన్ సందర్భంగా అధికారులు, పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసుకొని ముందస్తు జాగ్రత్తలు చేపట్టిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఉండవల్లి సిఎం క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకు అవార్డు అందజేసి అభినందించారు.

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



సిఎం నుంచి అవార్డు అందుకుంటున్న ఎమ్మెల్యే కొండయ్య

మొంథా తుఫాన్ సమయంలో ప్రజలకు అండగా నిలిచి ఉత్తమ సేవలు అందించిన చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను సిఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ప్రశంసించారు. సిఎం క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్యను అభినందించి ఉత్తమ సేవా అవార్డు అందజేశారు.

ప్రజాశక్తి- చీరాల

పంట నష్టాన్ని అంచనా వేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీరాజ్ మరియు ఆర్అండ్బి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నష్టం అంచనాలను పూర్తి స్థాయిలో సమగ్రంగా నివేదించాలని సూచించారు. దెబ్బతిన్న ఇరిగేషన్ కెనాల్స్, చెరువులకు సంబంధించి నష్టం అంచనాలను రూపొందించాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో మంచినీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య మెరుగుదల పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సారథ్యంలో సహాయక చర్యలు చేపట్టడంలో అన్ని శాఖల అధికారులు, వారి సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, ఇరిగేషన్, ప్రాజెక్ట్స్ ఎస్ఇలు వరలక్ష్మి, అబూత్‌ఆలి, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్బి, పంచాయతీరాజ్ ఎస్ఇలు బాలశంకరరావు, రవినాయక్, అశోక్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిపిఒ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాల విభజనలోకి
రామాయపట్నం రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత సిఎం చంద్రబాబు శంకుస్థాపన కూడా చేశారు.తర్వాత వైసిపి ప్రభుత్వంవచ్చాక పోర్టు పనులు చేపట్టారు. ఇపుడు పూర్తవుతోంది.దీని ప్రయోజనాలు అందే దశలో ఇపుడు పోర్టు కోసం రాజకీయాలు నడుస్తున్నాయి. ఇదే ఆందోళనకరంగా ఉంది. దీనిపై జిల్లా పాలకపక్షప్రజాప్రతినిధులు కూడా పట్టీపట్టనట్లుగా ఉన్నారు. కందుకూరును ప్రకాశం జిల్లాలో కలిపే విషయంపై సందిగ్ధం నెలకొందనే కథనాలు మీడియాలో వస్తున్నపుడు కూడా ఎవరూ స్పందించడం లేదు. దీంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళన కూడా కందుకూరు నియోజకవర్గ ప్రజానీకంలో కనిపిస్తోంది. ప్రకాశంలో కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలు కలిపితే ఐదు నియోజకవర్గాలతో ప్రకాశం కొనసాగుతుంది. మార్కాపురం కేంద్రంగా పశ్చిమాన ఉన్న ఐదు నియోజకవర్గాలో కొత్త జిల్లా ఏర్పాటు చేయాలన్నది కీలకాంశంగా ఉంది. మార్కాపురంపై సందేహాలు లేకపోయినా కందుకూరు పైనే అనేక అనుమానాలకు తావిచ్చేలా తెరచాటు వ్యూహాలు నడుస్తున్నాయి. దీనిపై జిల్లా మంత్రులు స్పందించాలని కోరుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కందుకూరును ప్రకాశంలో విలీనం చేసేలా చూడాలని భావిస్తున్నారు. మంత్రి వర్గ ఉపసంఘం నివేదికలో ఏం ఉందో కూడా జిల్లా నేతలు గుర్తించాలి. సిఎం ఇచ్చిన హామీ మేరకు కందుకూరుపై ముందుకు పోవాలనే అభిప్రాయం ఆ నియోజకవర్గంలో వ్యక్తమవుతోంది. ఈనెల 7న నిర్వహిస్తున్న క్యాబినెట్ సమావేశంలో జిల్లాలపై తుదినిర్ణయం తీసుకుంటారనే చర్చ సాగుతోన్న నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు కీలకంగా వ్యవహరించాలని ఆశిస్తున్నారు.



శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఒ

సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం అనుములపల్లి గ్రామంలో రైతులకు మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాష శనివారం సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు. శనగలు కోసం గతములో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు 25% సబ్సిడీపై శనగలు పంపిణీ చేశారు. దాదాపు 300 క్వింటాల శనగలు పంపిణీ చేసారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భూపని కాశయ్య, వెంకటపతి శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ రమేష్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు హర్షవర్ధని పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో
వికలాంగుడికి పెన్షను అందజేత

ప్రజాశక్తి-కంభం

పట్టణంలోని తెలుగు వీధి 5వ వార్డులో నివాసం ఉంటున్న పిల్లారి లోకేశ్వరరావు డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తూండేవాడు. అనారోగ్యాల కారణంగా తన కుడికాలును మోకాలు వరకు తీసివేశారు. గత ప్రభుత్వంలో వికలాంగుల పెన్షన్ కోసం అర్జీలు ఇచ్చినా ఫలితం లేకపోయింది. గత నెల గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి దగ్గరికి వెళ్లి తన సమస్యను వివరించుకున్న వికలాంగుల పెన్షన్ బాధితుడి కోరిక మేరకు గిద్దలూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రభుత్వ పింఛన్ వచ్చేవరకు తన సొంత నిధులతో రూ.4000/- పెన్షన్ ఇస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు నవంబర్ నెల నుంచి పెన్షన్ నగదును అందజేశారు. అందులో భాగంగా శనివారం ఉదయం రూ.4000/- నగదును స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి అదేశానుసారం ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, గిద్దలూరు నియోజక



వికలాంగుడికి పెన్షను అందిస్తున్న దృశ్యం

వర్గం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి గోన చెన్నకేశవులు దగ్గరుండి అందజేశారు. పెన్షన్ నగదు అందుకున్న లోకేశ్వరావు కుటుంబం గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు బి వెంకటరమణ, ఐదవ వార్డ్ మెంబర్ బి వెంకటేశ్వర్లు, మండల టిడిపి నాయకులు భూపాలుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ హైస్కూలులో
ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని బ్రిలియంట్ హైస్కూల్ కరస్పాండెంట్ బి కుల్లాయప్ప ఆధ్వర్యంలో శనివారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి కుల్లాయప్ప మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 48 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి తెలుగు రాష్ట్రం ఏర్పాటు కోసం ప్రాణాలను తృణప్రాయంగా విడిచిన మహానుభావుణ్ణి స్మరించుకోవడం మన కర్తవ్యమని అన్నారు. 1956 నవంబర్ 1వ తేదీన ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనేక ఒడిదుడుకులు, ఇబ్బందులు ఎదుర్కొని నేడు స్థిరమైన అభివృద్ధి దిశగా సాగుతుందని, అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతూ అమరజీవి ఆశయ సాధనకు కృషి చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ హైస్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవలో 'కిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని దేవరాజుగట్టు వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సమాజ సేవలో ముందుంటోందని పెద్దారవీడు ఎస్ఐ వి సాంబశివయ్య కొనియాడారు. కళాశాల యాజమాన్యం కూడా ప్రోత్సాహం అందించడాన్ని అభినందించారు. దేవరాజుగట్టులో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అక్కడి జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా ఎస్ఐ సాంబశివయ్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి సామాజిక సేవ అలవర్చుకోవడం మంచిదన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సేవాదృక్పథం పెరుగుతుందన్నారు. బాధ్యత, ఐక్యత గుర్తిస్తారన్నారు. అనంతరం ఆ పాఠశాల ఆవరణ పరిశుభ్రంతో పాటు మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యమ్రానికి ఆ గ్రామ సర్పంచి మెట్టు లక్ష్మి శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్ రసూల్, పంచాయతీ కార్యదర్శి వి సంధ్య, కార్యక్రమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పివి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

పోలీసు స్టేషన్‌లో సిఐ తనిఖీ

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు పోలీస్ స్టేషన్‌ను గిద్దలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె రామకోటయ్య, కొమరోలు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లో జరుగుతున్న పరిపాలన పనితీరును, రికార్డుల నిర్వహణను, యూఐ (అన్‌డిటెక్టెడ్ అండ్ ఇన్వెస్టిగేషన్) కేసుల ప్రగతిని సమీక్షించారు. సీసీటీఎన్ఎస్ అప్‌డేషన్ పెండింగ్ అంశాలను పరిశీలించి, తక్షణంగా అప్‌డేట్ చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజాభద్రత, న్యాయవ్యవస్థ పట్ల నిబద్ధతతో, పోలీసులు మరింత సమర్థంగా సేవలందించాలని సిఐ రామకోటయ్య సిబ్బందిని ప్రోత్సహించారు.

మాణిక్యాలరావును కలిసిన చెంచయ్య

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావును అమరావతిలో తన కార్యాలయంలో దోర్నాల మండలం ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు ఎలకపాటి చెంచయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలతో సన్మానించారు. మండలంలోని డప్పు కార్మికులు చర్మ కార్మికులతోపాటు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ప్రజాశక్తి 3
ఆదివారం 2 నవంబర్ 2025

నిర్వాసితులకు అండగా ఉంటాం

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-మద్దిపాడు

తుఫాను ప్రభావ ప్రాంతాలలో బాధిత ప్రజల సాధారణ జీవితానికి ఎలాంటి ఇబ్బందీ కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ చెప్పారు. శనివారం మద్దిపాడులోని పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆర్థిక సహాయం, నిత్యవసర వస్తువులను బిఎన్.విజయ్ కుమార్, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ జయంత్ బాబుతో కలిసి ఆయన అందించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పునరావాస కేంద్రంలో ఉన్నవారికి 25 కేజీల బియ్యం, కేజీ పంచదార, కేజీ కందిపప్పు, కేజీ పామ్ ఆయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళదుంపలను



సరుకులు పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే



బియ్యం పంపిణీ చేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

ఇస్తున్నామన్నారు. మత్స్యకార కుటుంబాలు అయితే ఈ నిత్యవసర సరుకులతో పాటు 50 కేజీల బియ్యం ఇస్తున్నట్లు చెప్పారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన ప్రతి వ్యక్తికి వెయ్యి రూపాయలు చొప్పున, ముగ్గురు ఉంటే మూడు వేలు లేదా గరిష్టంగా కుటుంబానికి 3000 ఆర్థిక సహాయాన్ని కూడా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాల నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత తక్షణ జీవనాధారం కోసం ప్రభుత్వం ఈ విధమైన సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం సమర్థంగా పనిచేయటం ద్వారా ప్రాణ నష్టాన్ని నివారించగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, తహసిల్దార్ ఆదిలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, ముళ్ళూరి మురళి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రెబ్బవరపు ప్రభాకర్, మండవ గోపీచంద్, గ్రామ పార్టీ అధ్యక్షులు కడియాల రఘుబాబు, రావి నరసింహారావు, నవులూరు శివకృష్ణ, శుద్ధపల్లి నరసింహారావు, డిప్యూటీ తాసిల్దార్ అజయ్ రెడ్డి, ఆర్ఐ రమణయ్య, పంచాయతీ కార్యదర్శి నూరుల్లా పాల్గొన్నారు.

దర్శి: దర్శి మండలం మరియు టౌన్ పరిధిలోని పునరావాస కేంద్రాల నుంచి తిరిగి ఇళ్లకు వెళ్ళే తుఫాను బాధిత 57 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.3వేలు నగదు, 25 కేజీల బియ్యం, లీటర్ నూనె, కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళా దుంపలు, కిలో పంచదార, దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీతోపాటు మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, దర్శి మండల తహశీల్దార్ శ్రవణ్‌కుమార్, ఎన్ఫోర్స్మెంట్ డిటి రాధాకష్ణ, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మండల టీడీపీ అధ్యక్షులు మరెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్నా, శోభరాణి ఉన్నారు.

తాళ్ళూరు: బొద్దికూరపాడులో పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన 25 ఎస్టీ కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి నిత్యావసరాలు, 25 కేజీల బియ్యం, రూ.వెయ్యి నగదు శనివారం అధికారులు, కూటమి నాయకులు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో పోలంరెడ్డి రమణారెడ్డి, సుబ్బారెడ్డి, కోటిరెడ్డి, వీరనాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, గుజ్జుల అంజిరెడ్డి, గోపాలరెడ్డి, బాలిరెడ్డి పాల్గొన్నారు.



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

చీరాల వైపు నుంచి ఒంగోలు వైపు అక్రమంగా నాలుగు వాహనాల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్ఐ రజియా సుల్తానా శనివారం దాడి చేసి పట్టుకున్నారు. నాలుగు మినీ వ్యాన్లలో తరలిస్తున్న 545 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వాహనాలను స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జరుగుమల్లి: టంగుటూరులో అక్రమంగా తరలిస్తున్న 41 బస్తాల రేషన్ బియ్యాన్ని ఎస్ఐ నాగమల్లేశ్వరరావు స్వాధీనం చేసుకున్నారు. శనివారం వేకువజామున టాటా ఏస్ వెహికల్‌లో రేషన్ బియ్యాన్ని కావలి తరలిస్తుండగా ఎస్ఐ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండలంలోని వేములపాడు గ్రామ శివారు ప్రాంతాలలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై మాధవరావు ఆధ్వర్యంలో పేకాట శిబిరంపై మెరుపు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.2,510 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పడుకున్నట్టు తెలిపారు.

'వైవి'పై ఆరోపణలు సరికాదు

ప్రజాశక్తి-వెలిగండ్ల

తిరుమల పవిత్రతను రాష్ట్రమంతటా చాటిచెప్పిన వ్యక్తి వైవి సుబ్బారెడ్డి అని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా ఆయన పాలనలో ఎంతో పారదర్శకంగా దళిత గోవింద కార్యక్రమాలు నిర్వహించిన ఘనత వైవి సుబ్బారెడ్డిదే అన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారం బయటపడగానే నెయ్యి నాణ్యతను తేల్చడానికి నమూనాలను మైసూరు ల్యాబ్‌కు పంపాలని, సిబిఐ ఎంక్వైరీ చేయాలని చెప్పిన మొదటి వ్యక్తి వైవి సుబ్బారెడ్డి అన్నారు. నిజాయితీపరుడైన వ్యక్తిపై ఆరోపణలు సరైన చర్య కాదని, దీనిని ఖండిస్తున్నానని తెలిపారు.



ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ట్రిపుల్ ఐటి భూముల పరిశీలన

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మండలంలోని బల్లిపల్లి ప్రాంతంలో ఆధ్యాత్మిక క్షేత్రం రూపకల్పనకు చర్యలు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. బల్లిపల్లి గ్రామంలోని ట్రిపుల్ ఐటీ కళాశాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలం పక్కనే ఉన్న ఎత్తయిన కొండ ప్రాంతాన్ని ఆయన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఆ ప్రదేశం గిరి ప్రదక్షిణకు అనువుగా ఉందని గుర్తించిన ఎమ్మెల్యే, భక్తుల కోరిక మేరకు అక్కడ ఆధ్యాత్మిక క్షేత్రం నిర్మాణానికి పునాది వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో భైరవకోన, మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి, మాలకొండ లక్ష్మీనరసింహస్వామి వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయన్నారు. అదే తరహాలో బల్లిపల్లి ప్రాంతాన్ని కూడా శివక్షేత్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం, భక్తులు కలసి ముందుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసరెడ్డి, నాయకులు కుందూరు తిరుపతిరెడ్డి, బాలు ఓబుల్ రెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, కాచు కృష్ణారెడ్డి, అట్లా మల్లికార్జున్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-దర్శి

నవంబరు 8వ తేదీన దర్శిలో సిఐటియు బహిరంగ సభ జరుతుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన విలేఖరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బహిరంగ సభకి సిఐటియు రాష్ట్ర, ప్రధాన కార్యదర్శి, విశాఖ స్టీల్ ప్లాంట్ పోరాట నాయకులు సిహెచ్.నరసింగరావు, అంగన్‌వాడీ రాష్ట్ర కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ, మున్సిఫల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథులుగా



మాట్లాడుతున్న పల్లాపల్లి ఆంజనేయులు

హాజరై ప్రసంగిస్తారన్నారు. దర్శి పిజిఎన్ కళ్యాణ మండపంలో జిల్లా 13వ మహాసభలు రెండు రోజులపాటు జరుగుతున్నాయని, జిల్లా నలుమూలల నుంచి అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన వర్కర్స్, కాంట్రాక్టు, ఆవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ముఠా, బిల్డింగ్, ఆటో, మున్సిపల్ కార్మికులు తదితర యూనియన్‌లకు ప్రాతినిధ్యం వహిస్తూ 300 మంది ప్రతినిధులు చర్చించి 32 రకాల సమస్యలపై చర్చించి తీర్మాణాలు చేస్తారన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు ప్రచారయాత్ర నవంబరు 5 నుంచి 8 వరకు జరుతుందని, కరపత్రాలు, బుక్‌లెట్స్, జనరల్ బాడీ సమావేశాలు, గ్రూప్ మీటింగ్స్ తదితర ప్రచార సామాగ్రితో జిల్లా వ్యాప్తంగా ప్రచారం విస్తుతంగా జరుగుతుందని జయప్రదం చేయడానికి దర్శి పట్టణ ప్రజలు, పుర ప్రముఖులంతా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు, రైతు, డివైఎఫ్ఐ నాయకులు తాండవ రంగారావు, ఉప్పు నారాయణ, తోట తిరపతిరావు, ఆది నారాయణ, షేక్.కాలేబాషా, లక్ష్మి, రంగమ్మ, పద్మావతి, కెవి.పిచ్చయ్య, గర్నిపూడి జాన్ సామ్యేల్, కొమరగిరి కోటేశ్వరరావు, గుంటు బాలగురవయ్య, అలూరి ఇస్సాయిల్, గోగు వెంకయ్య పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

చీమకుర్తి: 13వ సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం స్థానిక సివిల్ సప్లై గోడౌన్ వద్ద సివిల్ సప్లై ముఠా వర్కర్స్ గేట్ మీటింగులో ఆయన మాట్లాడారు. నవంబర్ 8, 9 తేదీలలో దర్శిలో సిఐటియు జిల్లా మహాసభలు జరుగుతాయని, 8వ తేదీన ఉదయం 10 గంటలకు మహా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. బహిరంగ సభలో ఎక్కువమంది పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బిందె ఆంజనేయులు, నాగరాజు, వెంకయ్య, మణికంఠ, బ్రహ్మయ్య, సుబ్బారావు, కార్మికులు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్ ఇవ్వనున్న ఎంపీపీ?

టిడిపిలో చేరేందుకు సన్నాహాలు



ఎంపిపి ప్రకాశం

ప్రజాశక్తి-కనిగిరి : కనిగిరి రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వైసీపీకి చెందిన ఎంపిపి దంతులూరి ప్రకాశం త్వరలోనే తెలుగుదేశం పార్టీ బాటలోకి వెళ్లనున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. అతి త్వరలో ఆయన తన అనుచరులు, నాయకులు, కొంతమంది కౌన్సిలర్లతో కలసి టిడిపిలో చేరేందుకు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విషయంపై ఆయన పార్టీ స్థానిక నాయకులతో చర్చలు ముగించారని, ఈ నెలలోనే మంత్రి సమక్షంలో అధికారికంగా టిడిపి కండువా కప్పుకునే అవకాశం ఉన్నట్లు ఆయన వర్గాలు పేర్కొంటున్నాయి. ఎంపీపీ ప్రకాశం ఇటీవల తన అనుచరులతో జరిగిన సుదీర్ఘ భేటీలో ప్రజల సమస్యలు పరిష్కరించాలంటే అభివృద్ధి పట్ల కట్టుబాటుతో ఉన్న నేతలతో కలసి పనిచేయాలి అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకోవడంతో, స్థానిక నాయకుల్లో చైతన్యం నెలకొన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీపీ ప్రకాశం టీడీపీ శిబిరంలో చేరితే మండల స్థాయిలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగలనుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ నెలలోనే మంత్రి సమక్షంలో ఆయన అధికారికంగా పార్టీలో చేరనున్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఎంపీపీ దంతలూరి ప్రకాశంతో పాటు కొంతమంది ప్రజాప్రతినిధులు, నాయకులు టిడిపిలో చేరేందుకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనప్పటికీ కనిగిరి ఎంపీపీ దంతులూరి ప్రకాశం టిడిపిలో చేరితే వైసీపీకి పెద్ద ఎత్తున నష్టం జరిగే అవకాశం ఉందని వైసిపి, టిడిపి వర్గాలు చర్చించుకోవడం విశేషం.

'గుండ్లకమ్మ' సందర్శించిన ఎంపీ కృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి-మద్దిపాడు

మల్లవరంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టును బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ జయంత్ బాబుతో కలిసి శనివారం సందర్శించారు. ఇటీవల తుఫాన్ కారణంగా గుండ్లకమ్మ 14 గేట్లు ఎత్తి నీళ్లను సముద్రంలోకి విడుదల చేయగా ఆ సమయంలో పలు గ్రామాలలోనీ కాలనీలు మునిగాయి. ఈ నేపథ్యంలో గుండ్లకమ్మను సందర్శించారు. ఎన్ని గేట్లు ద్వారా నీళ్లు వెళుతున్నాయి? ఇన్ఫ్లో ఎంత వస్తుంది? ప్రస్తుతం డ్యామ్ లో ఎంతవరకు నీరు ఉంది? డ్యాం కెపాసిటీ ఎంత? తదితర విషయాలను డ్యామ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్లవరం వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ మార్నేని రాఘవ గ్రామంలోకి వెళ్లేటప్పుడు ఉన్న నేలచప్టా వద్ద బ్రిడ్జి నిర్మించాలని ఎంపీ కృష్ణ ప్రసాద్‌ను కోరారు. వర్షాలు వచ్చిన ప్రతి సందర్భంలోనూ నేలచప్టా పై నీళ్ల ప్రవహించి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని బ్రిడ్జి నిర్మాణం కోసం సహకరించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎంపీ ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎంపీ వెంట టిడిపి మండల అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండవ గోపి చంద్, ముళ్ళూరి మురళి, రెబ్బవరపు ప్రభాకర్, నర్రా సురేష్, నల్లూరి అజయ్, శివకృష్ణ, పలువురు నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కృష్ణ ప్రసాద్



మాట్లాడుతున్న బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - వేటపాలెం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. మండలంలోని చల్లారెడ్డిపాలెం అసిస్టెంట్ గెస్ట్ హౌస్ సమీపంలోని ఎస్టీ కాలనీలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేసి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వృద్ధులు, వితంతు, దివ్యాంగులు గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం అండగా ఉండాలనేదే సిఎం చంద్రబాబు అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం అన్నారు. ఇది కేవలం ఆర్థిక సాయం కాదని, గౌరవం, భద్రత, ఆత్మస్థైర్యానికి ప్రతీకని పేర్కొన్నారు. విజనరీ దృష్టితో పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి చేకూర్చడమే తమ ధ్యేయం అన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు, వ్యవసాయ మౌలిక వసతులు బలోపేతం చేయడానికి చర్యలు ప్రారంభించామని తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం వేగంగా సహాయక చర్యలు చేపడుతోందని అన్నారు. రైతులు, కూలీలెవరూ నిర్లక్ష్యానికి గురికావొద్దని స్పష్టం చేశారు.

ఎంపిడిఒ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - వేటపాలెం



వెంకటేశ్వరరావు

మండలంలోని దేశాయిపేట పంచాయతీ గ్రేడ్1 కార్యదర్శిగా పనిచేస్తున్న టి వెంకటేశ్వరరావుకు ఉద్యోగ ఉన్నతి లభించింది. శనివారం డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మండలంలో పంచాయతీల్లోని దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి పట్ల తన వంతు కృషి కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మేడబలిమి రాజేష్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు. ఉద్యోగ ఉన్నతికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

కాశీబుగ్గ మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ప్రయివేటు వ్యక్తి నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మందికి పైగా సందర్శకులు దుర్మరణం చెందడం బాధాకరమని మాజీ సైనిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం జరిగిన ఘటన తెలిసిన వెంటనే శ్రీకాకుళం జిల్లా మాజీ సైనిక సంఘం అధ్యక్షులు కటకం పూర్ణ చంద్రరావు, కాశీబుగ్గ సమీపంలో పలాస మాజీ సైనిక సంక్షేమ సంఘం అసోసియేషన్ అధ్యక్షులు ఇళ్లా మన్మధరావుతో మాట్లాడి అక్కడ జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఘటనకు దారి తీసిన కారణాలపై విచారణ జరిపించాలని కోరారు. మరణించిన బాధి కుటుంబాలను నిర్వాహకుడితోపాటు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బాధితులకు తమ వంతు సేవలు అందించాలని మాజీ సైనికులకు సూచించారు.

3న మండల సమావేశం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 3న స్థానిక ఎంపిఒ కార్యాలయంలోని సమావేశం హాలులో జరుగుతుందని ఎంపిడిఒ జావెద్ తెలిపారు. సమావేశనికి ఎంపిపి రజని అధ్యక్షత వహిస్తారని తెలిపారు. వివిధ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి, ప్రజల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని చెప్పారు.

రైతులను ఆదుకుంటాం : గొట్టిపాటి

ప్రజాశక్తి - అద్దంకి



పంటలు పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పర్యటనలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్‌తో కలిసి మండలంలోని కుంకుపాడు, మోదేపల్లి, కొటికలపూడి పంచాయతీలోని పార్వతీపురం గ్రామం సందర్శించారు. తుఫాన్ కారణంగా తీవ్రంగా దెబ్బ తిన్న పంట పొలాలు, వంతెనలు, గ్రామీణ రహదారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. పంటనష్టం అంచనాలు సక్రమంగా నమోదు చేసి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతుల కష్టాన్ని అర్థం చేసుకుని ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందని అన్నారు. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కల్తీ విత్తనాలతో రైతులకు నష్టం

ప్రజాశక్తి - కొల్లూరు



రైతులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

మండలంలోని అనంతవరంలో ఎన్నారై బీపీటీ కల్తీ వరి విత్తనాలు రావడంతో దాదాపు 70 మందిపైగా రైతులు వెయ్యి ఎకరాల్లో వరి పంట నష్టపోయినట్లు రైతు సంఘం అధ్యక్షులు వేములపల్లి వెంకట రామయ్య తెలిపారు. ఎఒ వి నరేంద్రబాబు, ఎన్నారై అధినేతలు, బాపట్ల విత్తన తయారీ శాస్త్రవేత్తలతో కలిసి తాలు గింజలు వేసిన వరి పైరులను పరిశీలిం చారు. దీంతో వెంటనే అధికారులు స్పందించి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని రైతు సంఘం నాయకులు బొనిగల సుబ్బారావు కోరారు.

అధికారుల ఉత్తమ సేవా అవార్డులు



అవార్డు అందుకుంటున్న ఆర్‌టిఒ రంగారావు, అద్దంకి సిఐ సుబ్బరాజు

ప్రజాశక్తి - బాపట్ల

రవాణా శాఖలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఆర్‌టిఒ డిబివి రంగారావు సేవలను గుర్తించి సిఎం చంద్రబాబు నాయుడు ఉత్తమ సేవా అవార్డు శనివారం బహూకరించారు. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ సందర్భంగా అన్ని శాఖల సమన్వయంతో చేసిన సేవకు గుర్తింపుగా అవార్డు అందుకున్నారు. ఆయన ఉత్తమ సేవా అవార్డు అందుకోవడం పట్ల ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

అద్దంకి : పట్టణ సిఐ ఆరాధ్యుల సుబ్బరాజు సిఎం చంద్రబాబు చేతుల మీదుగా బెస్ట్ అవార్డు అందుకున్నారు. తుఫాన్ కారణంగా ప్రజలకు భరోసాగా సౌకర్యాలు కల్పించేందుకు ఆయన చేసిన కృషిని అభినందిస్తూ అవార్డు అందజేశారు. తుఫాను తీరం దాటిన తరువాత గుండ్లకమ్మ నదిలో పురపాలక సంఘ వాటర్ హౌస్‌లో పనిచేసే కార్మికులు నదిలో చిక్కుకోవడంతో వారికి ధైర్యం చెబుతూనే గుండ్లకమ్మ నది నుండి ధైర్య సాహసాలు కనబరిచి బయటికి తీసుకురావడంతో ప్రజలు అభినందించారు.

రేపల్లె : తుఫాను సమయంలో అత్యుత్తమ సేవలు అందించిన రేపల్లె సీడీపీఓ ఎం సుచిత్రను సిఎం చంద్రబాబు అవార్డు అందజేసి అభినందించారు. తుఫాను సమయంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్న పిల్లల భద్రత కోసం అంకిత భావం, సమన్వయం చేసిన కృషిని ప్రశంసించారు. 15 మంది గర్భిణీలు, 18 మంది బాలింతలు పునరావాస శిభిరానికి రామని నిరాకరించినా తగిన వాహనాలు ఏర్పాటు చేసి సురక్షితంగా చేర్చారు. అదే సమయంలో 7 రోజుల్లో కాన్పు అయ్యే గర్భిణీ స్త్రీలందరినీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పించి వైద్య చర్యలు తీసుకునేలా సమన్వయం చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఎం సుచిత్ర మాట్లాడుతూ ఈ అవార్డు తనకు మాత్రమే కాదని, మొత్తం ఐసిడిఎస్ బృందానికి లభించిన గౌరవం అన్నారు.

పర్చూరు : సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పర్చూరు పంచాయతీ కార్యదర్శి ఎ మస్తానరావు, నూతలపాడు కార్యదర్శి గోపి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఇరువురు కార్యదర్శులను అభినందించారు.



అవార్డు అందుకుంటున్న రేపల్లె సిడిపిఒ సుచిత్ర, పర్చూరు కార్యదర్శులు

ఎన్‌టిఆర్ పెన్షను పేదలకు భరోసా : నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల



పింఛన్లు పంపిణీ చేస్తున్న నరేంద్రవర్మ

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పేద ప్రజలకు ఆర్థిక భద్రత కల్పిస్తుందని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. పట్టణంలో 29వ వార్డు నాయుడు పాఠశాల వద్ద పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రఘునాథరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, బెస్త కార్పోరేషన్ డైరెక్టర్ చాపా సోమయ్య, నాటక అకాడమీ డైరెక్టర్ మందపాటి ఆంద్రెయ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చివుకుల దుర్గాప్రసాద్ శాస్త్రి, ఎంఎస్ శేషు, పులి శ్రీనివాసరావు, కూచిపూడి శ్యాంసుందర్, షేక్ షాకా, వినోద్, రమేష్, రాంబాబు, ప్రసాద్, అంజనేష్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - ఇంకొల్లు



రామ కోటేశ్వరరావు

తుఫాన్ ప్రభావంతో దెబ్బ తిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘం ఉపాధ్యక్షులు కె రామ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పర్చూరు డివిజన్ పరిధిలో పత్తి, మినుము, మొక్కజొన్న పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. ముందుగా వేసిన ముదురు మిరప తోటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. వరి విషయం వచ్చేసరికి కొమ్మమూరు కాలువ కింద వరి పంట పూర్తిగా నీటిలో మునిగిందని పేర్కొన్నారు. సహాయక చర్యలు చేపట్టటం, గ్రామాల్లో ప్రజలు, రైతులను పరామర్శించడంలో బాగా పనిచేశారని చెప్పారు. నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వడంలో కొనసాగించాలని అన్నారు. గత మూడేళ్లుగా వేసిన పంటలు, పండిన పంటల ధరలు లేక, తెగుళ్ల పకృతి వైపరీత్యాలతో నష్టపోయి పూర్తిగా దెబ్బతిని ఉన్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను ఆదుకోవటానికి త్వరగా చొరవ చూపి సహాయ పడాలని అన్నారు. ఎకరాకు కనీసం రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలోని పావులూరు ప్రాంతంలో ఎక్కువగా సాగు చేశారని అన్నారు. అప్పుల పాలైన రైతులు అసలే ఖరీఫ్ పంటలు ఏమి వేయాలో అర్థం కాక తక్కువ సాగు చేశారని తెలిపారు.



పంటలను పరిశీలిస్తున్న గాదె మధుసూదనరెడ్డి

పొలాల్లోని నీటిని తొలగించాలి

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి మాట్లాడారు. తుఫాన్ తాకిడికి దెబ్బతిన్న పంటల రైతులను తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట భూముల్లో నీటిని బయటకు వెళ్లగొట్టేందుకు ఇరిగేషన్, డ్రైనేజి అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్ల మధ్యలో నిలిచిన వర్షపు నీరు నీటితో జన జీవనం స్తంభించిందని అన్నారు. అధికారులు వెంటనే ఆ నీటిని తొలగించి, జన జీవనాన్ని పునరిద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కారంచేడు మండలంలో వరి పంట పూర్తిగా నీట మునిగి పొలాలు సముద్రాన్ని తలపిస్తున్నాయని అన్నారు. ఇంకొల్లులో మొక్కజొన్న, ప్రత్తి, మిరప పంటలు ముంపుకు గురైన రైతులకు నష్ట పరిహారం వెంటనే అందించాలని కోరారు. సమావేశంలో పర్చూరు, ఇంకొల్లు వైసిపి కన్వీనర్లు కఠారి అప్పారావు, చిన్ని పూర్ణరావు, ఉప్పలపాటి అనీల్, కోట శ్రీను, పాలేరు వీరయ్య, దాసరి వెంకట్రావు, బట్టు అనీల్, కుమ్మరి చందు, సర్పంచుల సంఘం కారంచేడు అధ్యక్షులు కొర్రపాటి అనీల్, కొమ్మర శ్రీను, తిరుపతి వెంకట విష్ణు, పొలరాజు, సత్యనారాయణ, అహ్మద్, యార్లగడ్డ శ్రీకాంత్, గోగినేని సతీష్, ఆంజనేయులు, కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి, దండా చౌదరి, కోటయ్య, మల్లా శ్రీను, రవి, రమేష్, శ్రీహరి, కోటి, శ్రీరాములు పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలోని పావులూరులో మొన్న తుఫాను దాటికి దెబ్బతిన్న పత్తి, మినుము పంట పొలాలను క్షేత్రస్థాయిలో వైసిపి ఇన్చార్జ్ మధుసూదనరెడ్డి పరిశీలించారు. పత్తి, మినుము, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. పెట్టిన పెట్టుబడిలో ఒక రూపాయి రైతు చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. కౌలు రైతులు పరిస్థితి దారుణంగా ఉందని తెలిపారు. రైతులు, కౌలు రైతుల పెట్టుబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కౌలు కాకనే ఎగరాకు రూ.20 నుంచి రూ.30 వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎకరాకు కనీసం రూ.20వేలకు తగ్గకుండా నష్టపరిహారం పంటలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నష్ట పరిహారం దక్కేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీరాములు, సుబ్బారెడ్డి, కోటేశ్వరరావు, కోటిరెడ్డి, బద్రిరెడ్డి, రామాంజనేయరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, ఆంజనేయరెడ్డి, ఆదియ, రాజు, హనుమంతరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజంలో భాగస్వాములు కావాలి

ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ ఉద్యోగులు నీతిగా, పారదర్శకంగా తమ విధులు నిర్వహించాలని, అవినీతి రహిత సమాజంలో భాగస్వాములు కావాలని ఎపిసిపిడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కట్టా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ భవన్‌లో విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ కట్టా వెంకటేశ్వర్లు, విజిలెన్స్ సిఐ బిటి నాయక్ ఆధర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టా వెంకటేశ్వరుల మాట్లాడుతూ కేంద్రం విజిలెన్స్ కమిషన్ ప్రతియేటా అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకూ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు అన్ని ప్రభుత్వ సంస్థలలో నిర్వహించాలని సూచించిందన్నారు. ఆ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ భవన్‌లో ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగులందరూ పారదర్శకంగా, విలువలతో ఉద్యోగం చేయాలన్నారు. అవినీతి రహిత సమాజంలో భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని సూచించారు. తుపాన్ సమయంలో అహర్నిశలు శ్రమించిన విద్యుత్ అధికారులు, ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. సమగ్రతతో దేశ అభివద్ధికి పాటుపడుతూ నీతిగా, పారదరకంగా విలువలతో పని చేస్తామని విద్యుత్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏగ్జిక్యూటివ్ ఇంజినీర్/ఆపరేషన్ హరిబాబు, హైమావతి, నాగేశ్వరావు, పాపారావు, సీనియర్. అక్కౌంట్స్ ఆఫీసర్ సుబ్బారావు, విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇ వెంకటేశ్వర్లు

సర్వీస్‌లోని ఉపాధ్యాయులకు

టెట్ మినహాయింపు ఇవ్వాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

సర్వీస్‌లో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) మినహాయింపు కల్పించాలని ఫ్యాప్టో నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రకాశం జిల్లా ఫ్యాప్టో ప్రతినిధులు డిఆర్ఒ చిన ఓబులేసు, జిల్లా విద్యాశాఖాధికారి ఏ. కిరణ్ కుమార్ శనివారం మెమోరాండం అందజేశారు. సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ప్రకారం ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు కూడా టెట్‌కు ఎలిజిబుల్‌గా పరిగణించాలన్న నేపథ్యంలో, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఫ్యాప్టో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ భారత్ లాంటి బోధేతర కార్యక్రమాలను తాత్కాలికంగా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యాయులు ఐక్యంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ కె. ఎర్రయ్య, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్‌కె.అబ్దుల్ హై, డి. శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, జయరావు, ఎస్. రవి, వి. సుబ్బారావు, అశోక్, జి.ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వైసిపి జిల్లా కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ఆవిర్భావానికి పునాది వేసిన పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని తెలిపారు. శ్రీరాములు త్యాగం వల్లే తెలుగు ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, రాష్ట్ర కార్యదర్శి బోట్ల రామారావు, పట్టణ అధ్యక్షుడు కటారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి జయంతి

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు, భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ ఇన్‌ఛార్జి, డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసం గౌరవాధ్యక్షులు తేళ్ల అరుణ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం వల్ల తెలుగు రాష్ట్రం ఏర్పడిందన్నారు. దేవులపల్లి కష్ణశాస్త్రి సాహిత్యం భావుకత, మాధుర్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలుగు భాష, సంస్కతిని కాపాడటం ద్వారానే వారి పట్ల నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని ఆమె అన్నారు. సంపూర్ణ కాళహస్తి మాట్లాడుతూ మహానుభావుల జయంతి నిర్వహించడం సమాజానికి ప్రేరణ కలిగించే చర్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంతికట్ల నాగేశ్వరరెడ్డి, చల్లా నాగేశ్వరమ్మ, నాగలక్ష్మి, గంథాలయ సిబ్బంది గోవిందమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

పేదల కళ్లల్లో ఆనందం చూడటమే లక్ష్యం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పేదల కళ్ళలో ఆనందం చూడాలన్నదే కూటమి ప్రభుత్వం ఆశయమని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. ఒంగోలు నగరంలోని 1వ డివిజన్ త్రోవగుంటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాన్ వచ్చినా ఒకటో తారీకునే పింఛన్లు ఇవ్వాలనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన అని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పింఛన్ల కోసం ఏడాదికి రూ.32.5 వేల కోట్లు పేదలకు ఖర్చు చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు నగర అధ్యక్షుడు బండారు మదన్, నాయకులు పల్లపోతు వెంకటేశ్వర్లు, నావూరి కుమార్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

పొగాకు బేళ్ల తిరస్కరణ

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

పొగాకు ధర కొద్దిమేర పెరిగినప్పటికి కొనుగోళ్లు గణనీయంగా తగ్గుతున్నాయి. శనివారం రెండు రీజియన్ల పరిధిలో రికార్డు స్థాయిలో 5,160 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. రెండు రీజియన్స్ పరిధిలో 11,423 బేళ్లు అమ్మకానికి వచ్చాయి. అందులో 6, 263 బేళ్లను కొనుగోలు చేశారు. నల్ల రేగడి నేలల పరిధిలోని ఒంగోలు 1, 2, వెల్లంపల్లి, టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల్లో 6,198 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 3,720 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 2,478 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ 349 ,కనిష్ఠ ధర రూ.60, సరాసరి ధర రూ.193.39 పైసలు పలికింది. లైట్ సాయిల్ పరిధిలోని పొదిలి, కనిగిరి, కందుకూరు 1,2 కలిగిరి, డిసి పల్లి కేంద్రాల్లో 5,225 బేళ్లు అమ్మకానికి వచ్చాయి. అందులో 2,543 బేళ్లు వివిధ కారణాల చేత 2,682 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ. 349, కనిష్ఠ ధర రూ.20, సరాసరి ధర రూ.173.47 పైసలు పలికింది.

వైద్య సిబ్బంది ఒన్ హెల్త్ ర్యాలీ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రపంచ వ్యాప్తంగా వేగంగా మారుతున్న పర్యావరణ పరిస్థితులు, కొత్త వైరస్‌లు, జంతువుల నుంచి మానవులకు వ్యాపించే వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో వన్ హెల్త్ అనే భావన అత్యంత ప్రాధాన్యత పొందుతోందని పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో, ఐఏపీఎస్‌ఎమ్ (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్) మరియు ఐసిఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 'వన్ హెల్త్ ఇనిషియేటివ్' ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ మరియు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ బి. శిరీదేవి మాట్లాడుతూ, ఒకే ప్రపంచం- ఒకే ఆరోగ్యం అనేది అంతర్జాతీయ స్థాయిలో స్వీకరించిన భావన అని తెలిపారు. మానవ ఆరోగ్యం, జంతువుల ఆరోగ్యం, పర్యావరణ ఆరోగ్యం ఈ మూడింటి మధ్య ఉన్న అనుసంధానాన్ని గుర్తించి సమగ్ర దష్టితో పనిచేయడం అవసరమని తెలిపారు. ఐఏపీఎస్‌ఎమ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. తిరుమలరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ లేకుండా మానవ ఆరోగ్యం నిలవదన్నారు. పశువుల ఆరోగ్య సంరక్షణ కూడా సమాజ ఆరోగ్యానికి కీలకమని పేర్కొన్నారు. పర్యావరణ ఆరోగ్యం అంటేనే సమాజ ఆరోగ్యం అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలోని అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె. భాస్కరి, డాక్టర్ వినీలా ప్రియాంక, నోడల్ ఆఫీసర్ డాక్టర్ పి. దివ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పి. స్పందన, డాక్టర్ జి. ఆశ్వన్,నర్సింగ్ విభాగానికి చెందిన ఎస్. మారుతి వరలక్ష్మి, ఎం. స్వరూపరాణి, సోషియల్ లెక్చరర్ రవిశంకర్, ఎంపిహెచ్ఇఒ వెంకటేశ్వర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ తిరుమల రావు

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఒంగోలు అపెక్స్ సూల్‌లో 9వ తరగతి చదువుతున్న మహేశ్వరరెడ్డి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కర్పసాండెంట్ కె. కోటిరెడ్డి తెలిపారు. స్థానిక డిఆర్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ నెల 3 నుంచి 5 వరకూ గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మహేశ్వరరెడ్డి పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మహేశ్వరరెడ్డి, పిఇటి జగదీష్‌ను పాఠశాల కరస్పాండెంట్ శివకోటి రెడ్డి, పాఠశాల డైరెక్టర్ వాకా రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

దరఖాస్తులకు గడువు పెంపు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : మైనంపాడులోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో నాలుగు లెక్చరర్ ఖాళీలను డిప్యూటేషన్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తు గడువు నవంబర్ 3 వరకు పెంచినట్లు డిఇఒ ఎ. కిరణ్ కుమార్ శనివారం తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ మరియు మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లను రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు లీప్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో గూగుల్ ఫారం ద్వారా దరఖాస్తు చేసిన అభ్యర్థులు కూడా తప్పనిసరిగా లీప్ యాప్ ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. లీప్ యాప్‌లోనే అప్లికేషన్ లింక్ అందుబాటులో ఉంటుందన్నారు. ఆ లింక్ ద్వారా ఫారం డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత అధికారుల చేత కౌంటర్‌సైన్ చేసి డీఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. సూచించారు.ఎంపికైన వారు నవంబర్ 19న డైట్ మైనంపాడులో ఫారిన్ సర్వీస్ డిప్యూటేషన్‌పై జాయిన్ కావాల్సి ఉంటుందన్నారు.ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం, అభ్యర్థికి 31 అక్టోబర్ 2025 నాటికి 58 సంవత్సరాలు నిండకూడదన్నారు. కనీసం ఐదేళ్లపాటు స్కూల్ అసిస్టెంట్‌గా సర్వీస్ పూర్తి చేసి ఉండాలన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజేషన్ చేయాలని వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లోని కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్, పెండింగ్ వేతనాల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ లెక్చరర్స్ జెఎసి నేతలు కోరారు. మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కాంట్రాక్ట్ లెక్చరర్ల జెఎసి చైర్మన్ కుమ్మరకుంట సురేష్ కో చైర్మన్ కల్లూరి శ్రీనివాస్ శనివారం కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం చేయబడిన యాక్ట్ 30/2023 వీటిని అనుసరించి జీవో నెంబర్ 114 విడుదలై 2 సంవత్సరాలు అయిందన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్‌ను తిరిగి ప్రారంభించాలన్నారు.కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్ పెండింగ్ అంశంపై పరిశీలించి తగిన న్యాయం చేస్తానని, "మే" నెల వేతనం సమస్యను కూడా పరిష్కరిస్తామని సిఎంవారికి హామీ ఇచ్చారు.

ఎన్‌టిఆర్ వైద్యసేవలు పునరుద్ధరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ : జిల్లాలోని ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఉచిత వైద్యసేవలను పునరుద్ధరించినట్లు జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి.హేమంత్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 42 ప్రైవేట్ నెట్వర్క్ హాస్పిటల్స్‌లో గతంలో మాదిరిగానే 3257 రకాల వ్యాదులకి సంబందించిన వైద్యసేవలు ఉచితంగా ప్రజలందరూ పొందవచ్చని ఆయన తెలిపారు. ఒంగోలు కిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యసేవల పునరుద్దరీకరణ, నాణ్యతా ప్రమాణాలను డాక్టర్ హేమంత్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్స్ కి చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఇళ్లంతా నీరు .. నివాసం ఎలా..?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు వర్షపు నీరు ఇళ్లను చుట్టుముట్టింది. ఇంటిలో నుండి బయటికి రావడానికి వీలు లేని విధంగా ఉండటంతో ఇళ్ల యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భట్టిప్రోలు గ్రామంలోని 10వ వార్డు కూరగాయల మార్కెట్ వెనుక జెండా చెట్టు బజారులో గత పది రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు నీరు బయటకు వెళ్లే మార్గం లేక అక్కడే నిలబడి దుర్వాసన వెదజల్లుతుంది. మురుగునీరు బయటికి వెళ్లడానికి ఉన్న కాలువలు పూర్తిగా ఊడిపోయింది. వరద నీళ్ల, మురుగు నీళ్ల రోడ్డు, ఇళ్ల చుట్టూ నిలబడి తీవ్ర అంతరాయంగా మారింది. పంచాయతీ అధికారులు, పాలకులు తమ ఇబ్బందులు పట్టించుకునే వారు లేరని ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పరిసరాలతోపాటు ఇళ్లలోకి వచ్చిన నీటిని మోటార్లు, ఆయిల్ ఇంజన్లతో బయటకు



భట్టిప్రోలులో ఇళ్లను చుట్టుముట్టిన వర్షపు నీరు

తోడించినప్పటికీ మరలా తెల్లరేటప్పటికి ఊట ఊరి యధావిధిగా ఇంటి ముందు నీళ్ల ఉంటున్నాయని వాపోతున్నారు. ఇళ్లలో సైతం నీరు నిలబడి నిలువ నీడ లేక కాళ్ల పాసి, దురదలు పుడుతూ అంటు రోగాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లగా పారిశుద్ధి కార్మికులు రహదారులు శుభ్రం చేయటం, పూడిన నీటి కాలువలు పూడిక తీసిన దాఖలాలు లేవని గ్రామస్థులు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల్లో మునిగిన మరుగుదొడ్లు

జండా చెట్టు వెనుక బజారులోని ఉర్దూ పాఠశాల్లో ఉన్న మరుగు దొడ్లు రెండు అడుగుల మేర వర్షపు నీటిలో మునిగిపోయాయి. ఈ నీటిని అధికారులు బయటకు తరలించేందుకు అరంగుళం పైపుతో విద్యుత్ మోటార్ వినియోగించారని, గత రెండు రోజులుగా నీటిని బయటికి తోడుతున్నప్పటికీ అంగుళం నీరు కూడా తగ్గలేదని ఆ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో విద్యార్థులు మరుగుదొడ్లను వినియోగించుకునే వీలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చొరవ చూపి ఈ ప్రాంతంలో నిలబడిన మురుగు నీటిని తక్షణం బయటకు తరలించి పారిశుద్ధ్యం చేపట్టాలని కోరుతున్నారు.

సమర్థవంతమైన పోలీసు విధులతో ప్రజలకు రక్షణ

జిల్లా ఎస్‌పి ఉమామహేశ్వర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మొంథా తుఫాన్ అనంతరం పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు మెరుగైన సేవలు అందించారని ఎస్పీ బి ఉమామహేశ్వర్ పోలీసు సిబ్బందిని అభినందించారు. సమర్థవంతంగా విధులు నిర్వహించడంతో ప్రజలు, ప్రజాప్రతినిధుల నుండి ప్రశంసలు వచ్చాయని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందుకున్న అద్దంకి సీఐ సుబ్బరాజు, రెండు వేరు వేరు ఘటనల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి 16మందిని రక్షించిన పర్చూరు పోలీసులు, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాన్ని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేసి రివార్డు ప్రకటించారు. అద్దంకి మున్సిపాపల్ సిబ్బంది పట్టణ శివారులోని చెరువు మధ్యలోని పంపు షెడ్ వద్ద విధులు నిర్వహించేందుకు వెళ్లి వరద ఉధృతిలో చిక్కుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న సీఐ



ఎస్‌పి ఉమామహేశ్వర్

సుబ్బరాజు తక్షణమే రిస్క్యూ బృందాన్ని పంపగా, వారు కూడా ప్రమాదానికి గురయ్యారు. సీఐ వేగంగా స్పందించి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్ ద్వారా గుర్తించి ఆరుగురుని సురక్షితంగా ఒడ్డుకు తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పర్చూరు పోలీసు స్టేషన్ పరిధిలో ప్రవహిస్తున్న మొండి వాగు అక్టోబర్ 29న ఎగువ నుండి వచ్చిన వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో లారీ యూనియన్ కార్యాలయం సమీపంలో వాగు కట్ట దెబ్బతింది. ఫలితంగా సమీపంలోని ప్రార్థనా మందిరంలోని 15 మంది వరద నీటిలో చిక్కుకుపోయారు. పర్చూరు ఎస్ఐ, సిబ్బంది, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం స్థానికుల సహకారంతో తాడు ద్వారా సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మరో ఘటనలో పర్చూరుకు చెందిన షేక్ మున్న అనే వ్యక్తి అదే రోజు సాయంత్రం మొండి వాగులో ప్రమాదవశాత్తూ పడిపోవడంతో ఎస్ఐ, బృందం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో డ్రోన్ సాయంతో శోధించి వాగు మధ్యలో ముళ్ల చెట్టుకు ఇరుక్కుని ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు గుర్తించి అతనిని రక్షించారు. ప్రాణాలు పణంగా పెట్టి మొండి వాగు ఉధృతి ప్రవాహానికి ఎదురొడ్డి 16 మందిని రక్షించిన పర్చూరు ఎస్ఐ జివి చౌదరి, పిఎస్ఐ పి గోపి, ఎఎస్ఐలు ఎస్ సురేష్‌రెడ్డి, పివి సాంబశివరావు, కానిస్టేబుళ్ల ఐ నాగూర్, ఎం శివకృష్ణ, షేక్ బాషా, ఎం వెంకటేశ్వర్లు, ఏఆర్ కానిస్టేబుల్ ఎన్ రమేష్ బాబు, హోంగార్డులు ఆర్ రవిశంకర్, కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌కు చెందిన ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందంలోని హెడ్ కానిస్టేబుళ్ల పి రవికుమార్, కె పోశయ్య, సిహెచ్ నరసింహారావు, కానిస్టేబుళ్ల ఏ కృష్ణారావు, డి శంకర్, ఎస్ సుబ్రహ్మణ్యం, జి అనీల్ కుమార్, డి రమేష్, కె కామరాజును అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

కేసుల విచారణ పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



సమావేశంలో ఎస్‌పి ఉమామహేశ్వర్, పోలీసు అధికారులు

నేరం చేసిన వ్యక్తులకు న్యాయస్థానాల్లో జైలు శిక్ష విధించబడితే బాధితులకు న్యాయం చేసినట్లే అవుతుందని, హత్యలు, పోక్సో, మహిళలపై జరిగిన అఘాయిత్యాలు, ఎన్‌డిపిఎస్ కేసుల్లో తప్పనిసరిగా నిందితులకు కోర్టుల్లో శిక్షలు పడే విధంగా కోర్టు కానిస్టేబుళ్ల, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, సంబంధిత పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశించారు. స్థానిక ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కోర్టు విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, సీఐలతో జైలు శిక్షల పురోగతిపై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. పోలీసు సిబ్బందికి కోర్టు ట్రయల్ సమయంలో ఎదురయ్యే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని సమన్వయంతో అధిగమించేందుకు అవసరమైన అంశాలపై దిశానిర్దేశం చేశారు. కోర్ట్ కానిస్టేబుళ్ల సమన్లు, వారెంట్లు ఎగ్జిక్యూట్ చేయడం, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయడం, కోర్టు వాయిదాలకు సాక్ష్యులను హాజరుపర్చడం, నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇవ్వడం వంటి అంశాలపై కీలక సూచనలు ఇచ్చారు. హత్యలు, మహిళలు, పిల్లలపై జరిగిన నేరాలు, ఎన్డిపిఎస్ వంటి కేసుల ట్రయల్ సమయంలో కోర్టు కానిస్టేబుళ్ల, కోర్ట్ మానిటరింగ్ సిబ్బంది, సంబంధిత పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, నేరస్తులకు తగిన శిక్షలు పడేలా చూడాలని సూచించారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసిన వెంటనే సిసి, పిఆర్‌సి నంబర్లు తీసుకోవాలని, సమన్లు సకాలంలో సాక్షులకు అందజేయాలని, సాక్షులను సమయానికి కోర్టులో హాజరుపర్చాలని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సత్సంబంధాలు కొనసాగించి నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలని అన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైనప్పటి నుంచి కేసు పూర్తయ్యేవరకు నేరాలు నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలను కోర్టుకు సమర్పించడంలో కోర్టు కానిస్టేబుళ్ల ప్రత్యేక శ్రద్ధ, బాధ్యత చూపాలని సూచించారు. కోర్టుతో సంబంధించిన సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని, సమన్లు, వారెంట్లు, కోర్టు డిస్పోజల్, కన్విక్షన్, అక్విటల్‌కు సమాచారాన్ని సిసిటీఎన్ఎస్‌లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. కోర్ట్ లైజన్ సిబ్బంది పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తూ నిబద్ధత, సమన్వయంతో పనిచేసి శిక్షల శాతం పెంపు సాధించాలని, అప్పుడే నేరాలు తగ్గుతాయని అన్నారు. న్యాయ వ్యవస్థ, పోలీసు సమన్వయంతోనే బాధితులకు సత్వర న్యాయం చేకూరుతుందని, ప్రజలకు నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిఆర్బీ డిఎస్పీ పి బాలమురళీకృష్ణ, ఎస్బీ సీఐ జి నారాయణ, జిల్లాలోని సీఐలు, పిఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్ల, కోర్టు మానిటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఎల్ఏ ఏలూరిని కలిసిన కెవి కృష్ణారావు

ఎంఎల్ఏ ఏలూరికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - పర్చూరు

ఆంధ్ర ప్రదేశ్ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనను ఎంపిక చేసినందుకు శాసన సభ్యులు ఏలూరు సాంబశివరావుకు కారుమంచి వెంకట కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. పర్చూరు పర్యటనకు వచ్చిన ఎంఎల్ఏ ఏలూరుని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కొత్తపాలెంలో పనులు చేయిస్తున్న సిబ్బంది

తుపాను సహాయక చర్యలు

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని కొత్తపాలెం యానాది సంఘం, గోశాల రోడ్డులో తుఫాన్ కారణంగా నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు శాసన సభ్యులు ఎంఎం కొండయ్య సూచన మేరకు పంచాయతీ సెక్రెటరీ దివ్య సాయి, టిడిపి గ్రామ అధ్యక్షులు సిహెచ్ సౌభాగ్య లక్ష్మి పర్యవేక్షణలో కాలువ తీత పనులు చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బక్కా శివప్రసాదరెడ్డి, చినిగే చంద్రారెడ్డి, మరక రమేష్ ఉన్నారు.




రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - రేపల్లె

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం శనివారం ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల్లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది, యువత, ప్రజలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం ప్రాణ దానంతో సమానమని అన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని తెలిపారు. రక్త దాన శిభిరం నిర్వహణలో సహకరించిన రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, ప్రజలకు డీఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వసంతం వీరరాఘవయ్య, సూపర్నెంట్ పృథ్వి గణేష్, జమీర్, కరిముల్లా పాల్గొన్నారు.



108 వాహనంలో ప్రసవించిన హవిల

'108'లో మహిళకు ప్రసవం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని బూదవాడకు చెందిన మద్దిమాల నాగరాజు భార్య హవిలా పురిటి నొప్పులతో బాధపడు తుంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు 108 వాహనాన్ని పిలిపించారు. ఆ వాహనంలో తీసుకు వెళుతుండగా కొండమూరు సమీపంలోకి వెళ్లేసరికి పురిటి నొప్పులు ఎక్కువై 108లోనే ఆడబిడ్డకు జన్మించింది. ఆమెకు రెండవ కాన్పు. కాన్పును ఈఎంటి నాగరాజు నిర్వహించారు. 108 పైలెట్ వెంకటేష్ సహాయం అందించారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రతిభా మూర్తులకు నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అద్దంకి చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ప్రతిభా మూర్తులు 48వ సభ శనివారం నిర్వహించారు. విద్వాన్ జ్యోతి చంద్రమౌళి జ్యోతి ప్రజ్వలన చేశారు. సభకు పొన్నూరి వెంకట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ప్రకాశం రచయితల సంఘం పూర్వ అధ్యక్షులు భీమనాదం హనుమారెడ్డి రచనా రంగంలో చేసిన కృషి ఎంతో ఉన్నదని పేర్కొన్నారు. కొల్లా భువనేశ్వరి, సినీ దర్శకులు ఆదుర్తి సుబ్బారావు ఎన్నో కళాత్మక సినిమాలకు దర్శకత్వం వహించారాని అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'మూగమనసులు' చిత్రానికి జాతీయ, రాష్ట్ర పురస్కారాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొల్లా భువనేశ్వరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పిసిహెచ్ కోటయ్య, అన్నంనేని వెంకటరావు, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, కాకాని రాధా కృష్ణ మూర్తి, లేవి ప్రసాద్, చప్పిడి వీరయ్య, చెన్నుపాటి రామాంజనేయులు, మలాది శ్రీనివాసరావు, బాచిన పూర్ణ చంద్రరావు, పంతంగి ఆంజనేయులు ,యువి బ్రహ్మం, షేక్ మస్తాన్, హరి ప్రసాద్,నాగేశ్వరావు, కోట అంజమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఆదివారం 2 నవంబర్ 2025

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ఏలూరి

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఏలూరి పర్యటన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్, పర్చూరు

తుపాను ప్రభావానికి గురైన ప్రాంతాల్లో రైతులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరామర్శించారు. మార్టూరు, పర్చూరు మండలాల్లో శనివారం పర్యటించారు. తుపానుకు దెబ్బతిన్న ఇళ్లు, పంటలు, రహదారులను పరిశీలించి బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మార్టూరు, పర్చూరు, నాగులపాలెం, ఉప్పుటూరు, వీరన్నపాలెం, పోతుకట్ల, కోమర్నేని వారిపాలెం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. రైతులను అడిగి పంటల పరిస్థితి తెలుసుకున్నారు. వరద ముంపుకు కారణాలు పరిశీలించారు. వరద కాలువల పూడిక తీసి ఆధునీకరిస్తామని పేర్కొన్నారు. తుపాను ప్రభావిత కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం ద్వారా అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు. వరి, పత్తి, మినుము, పెసర, మొక్కజొన్న, జూట్ పంటలకు నష్టం జరిగిందని అన్నారు. వరదలకు పాడైన రహదారులు పరిశీలించి మరమత్తులకు ఆదేశించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా రోడ్లను త్వరలోనే పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేస్తామన్నారు.


సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

బర్లీ పొగాకు కొనుగోళ్లపై దృష్టి

బర్లీ పొగాకు రైతుల సమస్యలు తెలుసుకున్న ఆయన మిగిలిన పొగాకును త్వరలో కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర చరిత్రలో పొగాకు కొనుగోలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. సిఎం చంద్రబాబు రైతులను ఆదుకునేందుకు పెద్ద మనసుతో పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.

మార్టూరు పాఠశాల పరిశీలన

మార్టూరు విజయనగర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. పాఠశాల్లో మౌలిక వసతులు తెలుసుకున్నారు. పెండింగులో ఉన్న నూతన తరగతి గదులు, ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎస్ఎ పీఓతో ఫోన్లో మాట్లాడారు. కొత్తగా ఏర్పాటు చేసిన వంటగదిని ప్రారంభించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

సిఎంఆర్ఎఫ్ ఎల్ఓసీలు అందజేత

సిఎం సహాయనిధి ద్వారా పలువురి వైద్యానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు ఎల్ఓసీలు అందజేశారు. బొల్లపల్లికి చెందిన మొగిలిచర్ల హర్షవర్ధన్‌కు రూ.లక్ష, ఇంకొల్లుకు చెందిన లెక్కే శ్రీకాంత్‌కు రూ. 2లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లా శ్రీనివాసరావు, మానం హరిబాబు, కొరియాల సురేషు, ముస్నంగి వెంకట సుబ్బయ్య, దాసరి ఉషా రాణి, ఎఎంసి చైర్మన్ గుంజి వెంకటరావు పాల్గొన్నారు.

ఊడిపడిన స్లాబ్ పెచ్చులు..

ప్రజాశక్తి - చీరాల

తుఫాను ప్రభావంతో కురిసిన వర్షం దాటికి మండలంలోని విజయనగర కాలనీలో ఇంటి పైకప్పు స్లాబ్ ఒక్కసారిగా ఊడి మంచంపై పడింది. ఆ సమయంలో మంచంపై నిద్రిస్తున్న తేళ్ళ సోమదాసు మంచంపై పడిందని తెలిపారు. అయితే అంతకు క్షణాల సమయం ముందు సోమదాసు భార్య, పిల్లలు నిద్రలేచి బయటకు వచ్చారని, తెల్లవారు జాము కావడంతో నిద్రపోతున్న సోమదాసు మంచంపైనే ఒక్కసారిగా స్లాబు ఊడి పడిందని తెలిపారు. ఈ ప్రమాదంలో సోమదాసుకు స్వల్ప గాయాలయాయని తెలిపారు. ఏళ్ల తరబడిన ఇల్లు కావటంతో తుఫాను ప్రభావంతో వర్షం నీటికి నాని ప్రమాదం జరిగిందని తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


మంచంపై ఊడి పడిన స్లాబు

వరిపంటకు భారీ నష్టం

ప్రజాశక్తి - బాపట్ల

మొంథా తుఫాను కారణంగా సంభవించిన అధిక వర్షాలకు మండలంలో 850 ఎకరాల్లో వరికి నష్టంవాటిల్లిందని వ్యవసాయ అధికారులు ప్రాథమిక నివేదిక ప్రభుత్వానికి సమర్పించారు. జిల్లెళ్ళమూడి, మూలపాలెం, అడవి పంచాయతీ పాండురంగాపురం ప్రాంతంలో వర్షం నీరు నిలిచి 35శాతం వరకు వరి పైరుకు నష్టం జరిగిందన్నారు. 598 మంది రైతుల వరిపైరు దెబ్బతిని నష్టపోయారని అన్నారు. పొలాల్లో రెండు రోజులుగా ఎడంతో వరిపైరు తెప్పరిల్లుకుందని ఎఒ కె శారద తెలిపారు.

పర్చూరు : మండలంలోని నూతలపాడులో మోంత తుఫానుకు దెబ్బతిన్న పొలాలను ప్రత్యేకాధికారి, డిప్యూటి కలెక్టర్ లవన్న, ఎఒ కె భాస్కరరావు పరిశీలించారు. రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని భరోసా ఇచ్చారు. రైతుల సమక్షంలో ఎఒ మాట్లాడుతూ తక్షణమే నష్టపోయిన పంటలను ఎపిఎఐఎంఎస్ యాప్ నందు నమోదు చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని రూరల్ ఎస్ఐ జి జ్యోతి అన్నారు. మండలంలోని కైతేపల్లిలో మాదక ద్రవ్యాల నివారణ, హెల్మెట్ ధరించడంపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. నేటి యువత మాదక ద్రవ్యాల బారిన పడి ఉజ్వల భవిష్యత్తు కోల్పోతున్నారని అన్నారు. చిన్న వయసు నుండే తల్లి, దండ్రులు పిల్లలకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించి కాపాడాలని అన్నారు. బైకులపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టం అంచనా గడువు పొడిగించాలి

ప్రజాశక్తి - వేమూరు

తుఫాన్ తీరం దాటిన రెండు రోజుల్లోనే ఎన్యూమరేషన్ ముగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గమని, ఎన్యూమరేషన్ గడవు వారం రోజుల పాటు పొడిగించాలని కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు తోడేటి సురేష్ డిమాండ్ చేశారు. ఎన్యూమరేషన్ జరిగే సందర్భంలో వాస్తవ సాగు దారులైన కౌలు రైతులను గుర్తించి వారి పేర్లు, వారు పండించిన పంటలకు నష్ట పరిహారాల రికార్డులో నమోదు చేయాలని కోరారు. కౌలు రైతు గుర్తింపు కార్డు, ఈ క్రాప్ బుకింగుతో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని నమోదు చేయాలని కోరారు. వాస్తవ సాగు దారులైన కౌలు రైతులకు నష్ట పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 29, 30తేదీల్లో భారీ వర్షాలు కురిసాయని, కానీ గురువారం, శుక్రవారం రెండు రోజుల్లో ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. నష్టపరిహారం ఇచ్చే సర్వే నెంబర్లోని భూమి నుండి వచ్చే దిగుబడిని మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఇటీవల విత్తనాలు, యూరియా, కాంప్లెక్స్ ఎరువుల రేట్లు పెరిగాయని, పురుగు మందులు, కూలీ రేట్లు, ట్రాక్టర్ల అద్దెలు, కౌలు రేట్లు పెరిగి సాగు భారంగా మారిందని అన్నారు. పెరిగిన సాగు ఖర్చులు దృష్టిలో పెట్టుకుని ఇన్ పుట్ సబ్సిడీ పెంచి ఇవ్వాలని కోరారు. ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దుచేసి దాని స్థానంలో స్వచ్ఛంద పంటల బీమా పథకానికి కూటమి సర్కారు తీసుకొచ్చిందని, దీని వలన కౌలు రైతులకు అవగాహన లేకపోవడంతో భీమ పాలసీ తీసుకునే విధానం తెలియక కౌలు రైతులు తీసుకోలేకపోయారని అన్నారు. దానికి తోడు బీమా ప్రీమియం భారంగా మారడంతో ఎక్కువ మంది కౌలు రైతుల బీమా పథకంలో చేరలేదని తెలిపారు. కాబట్టి బీమా పరిహారం వచ్చే అవకాశం లేనందున నష్టపరిహారం పెంచాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


పంటలు పరిశీలిస్తున్న కౌలు రైతు నాయకులు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

ప్రజాశక్తి - చీరాల

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డిఈ రఘురాం పాల్గొన్నారు.

పర్చూరు : రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు స్థానిక కొట్ల బజారులోని అమరజీవి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు మామిడిపాక హరి ప్రసాదరావు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు అమరావతిలో ఐదున్నర ఎకరాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించి నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్కె శంషిద్దీను, ఆకుల శ్రీనివాసరావు, కిరణ్ కుమార్, హనుమంతరావు, జనార్ధనరావు, వెంకటేశ్వరరావు, రంగా, ఊటుకూరు నిర్మల, ఎస్కె బుల్ల, బాబు మేస్త్రి, వినయ్, పూర్ణ పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఇంకొల్లు : మండలంలోని ఇడుపులపాడు యూపీ ఉన్నత పాఠశాల్లో ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం పిడపర్తి పేదిరెడ్డి ముందుగా దివంగత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు, ఆంధ్ర రాష్ట్ర ఉమ్మడి మద్రాస్ నుంచి హైదరాబాద్ నిజాం సంస్థానంతో కలిసి ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పడటం గురించి విద్యార్థులకు వివరించారు. 1956 నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు.

అద్దంకి : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములుకు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ బాచిన శివధర పూర్ణచంద్రరావు, సెక్రటరీ అలహరి హరిప్రసాద్, ట్రెజరర్ శ్రీనివాసరావు, మాజీ అసిస్టెంట్ గవర్నర్ లేవీ ప్రసాద్, ఊటికూరి రామకోటేశ్వరరావు, సంకా సుబ్రహ్మణ్యం, ఎఎంసి డైరెక్టర్ కురిచేటి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న చీరాల చైర్మన్ ఎం సాంబశివరావు


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని పూనూరుకు చెందిన రావెళ్ళ శ్రీనివాసరావు కుమార్తె సత్యనారాయణ స్వామి వ్రతానికి శుక్రవారం శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.


సైకిళ్లు అందజేస్తున్న మంత్రి రవికుమార్

ఉచితంగా సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని చక్రాయపాలెం జెడ్పి ఉన్నత పాఠశాలలోని 125 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఎన్ఆర్ఈడిసి ఎపి కంపెనీ సహకారంతో అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో సైకిళ్లను మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతులు మీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ జె కృష్ణహరీష్, కో ఆర్డినేటర్ డేవిడ్, ఎంఇఒ, హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోడిపర్రులో రేషన్ మాఫియా

ప్రజాశక్తి - వేమూరు

పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం మండలంలోని కోడిపర్రు రేషన్ డీలరు కార్డుకు 3కేజీలు తగ్గించి ఇస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపించారు. నవంబర్ నెలకు సంబంధించి లబ్ధిదారులకు యధావిధిగా రేషన్ మంజూరు చేసింది. అయితే ఈ నెలలో తుఫాను ఆసరా చేసుకుని ఆ గ్రామ డీలరు రేషన్ కార్డుకు 3కేజీల చొప్పున తగ్గించి అందిస్తున్నాడు. అదేమని ప్రశ్నించిన గ్రామస్తులకు వరద బాధితులకు పంపిస్తున్నామని, దానికి ప్రతి కార్డుదారుని నుండి 3కేజీల చొప్పున తగ్గించి ఇస్తున్నట్లు సమాధానం చెబుతునాడు. ఎందుకలా ఇస్తున్నారని కోడిపర్రు రేషన్ డీలర్‌ను ప్రశ్నించగా మిషన్లో అలాగే ఇచ్చారని, తామేమి చేయలేమని సమాధానం చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టి ప్రజలకు అందించే రేషన్ పక్కదారి పట్టకుండా చూడాలని గ్రామస్తులు కోరారు. ఇదిలా ఉండగా ఇప్పటికి ఆయా మండలాల్లో రేషన్ మాఫియా విచ్చలవిడిగా పెరిగిపోంది. తుఫాను బాధితులకు ప్రభుత్వం విడుదల చేసిన బియ్యంతో పాటు చేనేత, మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల చొప్పున బియ్యం, నిత్యవసర సరుకులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ బయ్యం కూడా పక్కదారి పట్టించేందుకు సిద్దమయ్యారని ఆరోపిస్తున్నారు.

అధికారుల కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి - బాపట్ల

మొంథా తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. ప్రాణ నష్టం జరగకుండా కలెక్టర్ వి వినోద్ కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్ సారధ్యంలో అధికారులు ఎంతో సమయస్ఫూర్తితో పనిచేశారని అన్నారు. తుఫాను వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇప్పటికే వేలాదిమంది పునరావాస బాధితులకు ఆర్థిక సాయం, నిత్యవసరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. నష్టపోయిన రైతుల జాబితా వ్యవసాయ శాఖ ప్రాథమికంగా తయారు చేసిందని అన్నారు. పంట పొలాలు, ఉద్యాన పంటలు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రజలకు పునరావాసం కల్పించి ఆదుకున్న అధికారులు, రెడ్ క్రాస్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



సిఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆర్‌డిఒ

ఆర్‌డిఒకు ఉత్తమ సేవా అవార్డు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మొంథా తుపాన్ నేపథ్యంలో ఒంగోలు నియోజకవర్గం, నగరంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టిన ఒంగోలు ఆర్‌డిఒ కె.లక్ష్మీ ప్రసన్న ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ఉండవల్లి సిఎం క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సిఎం చంద్రబాబు నాయుడు ఆర్‌డిఒ కె.లక్ష్మీ ప్రసన్నకు అవార్డు అందజేసి అభినందించారు. ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఆర్‌డిఒ లక్ష్మీ ప్రసన్నకు పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.



సిఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కమిషనర్

కమిషనర్‌కు ఉత్తమ సేవా అవార్డు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

మొంథా తుపాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని నగరంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరక్కుండా చర్యలు తీసుకున్న ఒంగోలు పాలక సంస్థ కమిషనర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అవార్డును అందజేసింది.'సైక్లోన్ మొంథా ఫైటర్' అవార్డును విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అవార్డు అందుకున్నారు. ఉత్తమ అవార్డు అందుకున్న కమిషనర్‌కు నగరపాలక సంస్థ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా రవాణాలో ప్రకాశం జిల్లా ముందంజ

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లాలో ప్రజా రవాణా వ్యవస్థ ప్రజల అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా ముందుకు సాగుతున్నట్లు ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ జి. సత్యనారాయణ పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం రూ 18.83 కోట్ల నష్టంలో ఉన్న జిల్లాను ప్రభుత్వ పథకాల అమలు ద్వారా రూ 8.24 కోట్లకు తగ్గించినట్లు శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. జిల్లా పరిధిలోని ఐదు ఆర్టీసీ డిపోల్లో మొత్తం 485 బస్సులు (384 ఆర్టీసీ, 101 అద్దె బస్సులు) రోజు రెండు లక్షల కిలోమీటర్ల మేర సుమారు 1.90 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు కొత్త సర్వీసులు ప్రారంభించడం, స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం, తుపాను సమయంలో సమర్థవంతమైన నిర్వహణ ద్వారా జిల్లాలో ఆర్టీసీ శాఖ సేవా నిబద్ధతను ప్రతిబింబిస్తున్నట్లు విశ్లేషించారు. మొంథా తుపాను సమయంలో డిపో మేనేజర్లు సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు, సూపర్వైజర్ల పర్యవేక్షణలో ఆర్టీసీ సిబ్బంది ముందస్తు ప్రణాళికలు అమలు చేసి ఎలాంటి ప్రాణనష్టం లేకుండా విపత్తును ఎదుర్కొన్నారని తెలిపారు. అంతరాయం లేకుండా సేవలు కొనసాగించడం ఆర్టీసీ ప్రతిష్టను పెంచిందన్నారు.ఆగస్టు 15న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం ద్వారా 75 రోజుల వ్యవధిలో రూ.30 కోట్లు రాయితీ పొందినట్లు తెలిపారు. రోజుకు సగటున 90 వేలమంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందుతున్నారని తెలిపారు. మహిళల సంఖ్య పెరగడం వల్ల బస్ స్టేషన్లలో మరిన్ని మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.స్త్రీ శక్తి పథకం కారణంగా పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అన్ని డిపో మేనేజర్లకు ప్రత్యేక ప్రణాళికలు ఇచ్చామన్నారు. ప్రయాణికులు రద్దీకి అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 25 పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ సర్వీసులు ప్రతిపాదనలు పంపామన్నారు. బస్సులు నిరంతర సేవలందించేందుకు షెడ్యూల్ 3, షెడ్యూల్ 4 విధానాలను కఠినంగా అమలు చేస్తున్నట్లు. రాత్రిపూట తనిఖీలు, ముందస్తు మెటీరియల్ ప్లానింగ్, జిల్లా స్థాయి తనిఖీలు వంటి చర్యలతో బ్రేక్‌డౌన్ రహిత ప్రయాణం లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్ స్టేషన్లలో 310 ఎయిర్‌పోర్ట్ సోఫా కుర్చీలు, 82 సీలింగ్ ఫ్యాన్స్, 44 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. తాగు నీటి సౌకర్యం మెరుగు పరచడం, గిద్దలూరులో ఆర్వో ప్లాంట్ , సమాచార కేంద్రాలు, అనౌన్స్‌మెంట్ సిస్టమ్స్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టాయిలెట్లు, నీటి సదుపాయాలను మెరుగుపరచడానికి ఇతర శాఖలతో సమన్వయాన్ని పెంచామన్నారు. జిల్లాలో 249 మందికి గ్రేడ్ 1 పదోన్నతులు కల్పించడంతో పాటు, కోర్టు వివాదంలో ఉన్న 150 కంట్రోలర్ ప్రమోషన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇటీవల మరణించిన 178 ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించినట్లు పేర్కొన్నారు. 711 మందికి వార్షిక ఇంక్రిమెంట్లు, 811 మందికి స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు ఇచ్చామన్నారు. జిల్లాలో ప్రధాన డిపోల నుంచి కొత్తపట్నం, పాకల, శ్రీహరికోట, మహానంది, యాగంటి వంటి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఒంగోలు డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ బి. ఫణికుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉండి,క్రిములు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో తరచూ వర్షాలు కురుస్తున్నాయని, వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రజలు ముఖ్యమైన జాగ్రత్తలు పాటించడం వల్ల సీజనల్ వ్యాధుల బారి నుంచి తమను రక్షించుకోవచ్చునని తెలిపారు. తమ చుట్టుపక్కల ప్రాంతాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి నిత్యం చేతులను సబ్బుతో కడుక్కోవాలన్నారు. తాగునీటిని కాచి చల్లార్చుకొని తాగాలన్నారు.

కనువిప్పు కలిగేనా...?

ముంపు సమస్య ఇప్పటిదికాదు. మూడు దశాబ్దాలుగా సాగుతోంది. తుపాను వస్తే ఒంగోలులోని లోతట్టు కాలనీలు నీళ్లలో తేలాడుతుంటాయి.జనాన్ని తరలిస్తారు. ఆహారం అందిస్తారు.రెండు, మూడు రోజులు కాలనీలు నీళ్లలోనే ఉంటాయి. మళ్లీ ఇళ్లకు చేరుతారు. అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తారు. వాటికి నిధులు తెచ్చి పనులు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే క్రమం నడవడం లేదు. పదిరోజులకు ఆ సమస్యనే మరిచిపోతారు. మళ్లీ తుపానులు వస్తేగానీ ముంపు గుర్తుకురాదు. ఇపుడు మొంథా తుపాను మరోసారి అందరి పనితీరునూ ప్రశ్నించింది. ఇప్పటికైనా గుణపాఠం నేర్చుతారా? లేదా?అన్నదే సంశయనంగా మారింది. రెండురోజులపాటు కురిసిన భారీ వర్షాలకు అంతా అతలాకుతలమైంది.జిల్లా అంతటా వర్షాలు కురవడం పెనుముప్పుగా మారింది. జిల్లా భౌగోళిక పరిస్థితి ప్రజలకు ఎలా ఉందనేదీ తేటతెల్లం చేసింది. ఇంత నీరు వస్తే ముంపు తప్పదా?నిజంగా దాన్నుంచి బయట పడలేమా? ప్రజాస్తులకు భంగం లేకుండా చేయలేమా?అంటే సమగ్రప్రణాళికలు రూపొందించి ఆచరణలో పెడితే ఏదైనా సాధ్యమే. మనిషికి సాధ్యం కానిదంటూ ఏదీ లేదు. గుండ్లకమ్మ నుంచి లక్ష క్యూసెక్కు నీరు వదిలితే చీరాల- ఒంగోలు రహదారి పై రాకపోకలు నిలిచాయి. జాతీయ రహదారులూ స్తంభించి పోయాయి.రోడ్ల నిర్మాణంలోనే నీళ్లపోయే మార్గాలపై దృష్టిలేదు. స్థానికంగా రహదారులను క్రాస్ చేసే నదులు, వాగులు, వంకలపై అధ్యయనం లేదు. అక్కడ నీళ్ల పోవడానికి ఏం చేయాలనే దానిపైనా స్పష్టత లేదు.గతంలో అనేక తుపానుల సమయాల్లో ముంపునకు నీరు పోయేమార్గాలు లేకనే అనేది తేలింది. ఇపుడు వాటిని సరిచేస్తే ఈ సమస్య ఉండదు. ఇప్పటికీ వాటిపై సమగ్ర దృష్టిలేదు. పొలాలన్నీ నీటమునగడానికి రహదారుల నిర్మాణంలో లోపాలేనని తేలింది. కొత్తగా చీరాల -ఒడరేవు రహదారి వల్ల కూడా పర్చూరు ప్రాంతంలో పెద్ద ఎత్తున ముంపు సమస్య వచ్చింది. బాపట్ల జిల్లాను వాగులు పెద్దఎత్తున ముంచాయి. పొలాలన్నీ నీటిలోనే ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. ఆక్రమణలు పెద్ద ఎత్తున సాగాయి. ఒంగోలు పట్టణం ఉత్తరం వైపున ఉన్న పోతురాజుకాలువ సుమారు 30కిపైగా కాలనీలను ముంచుతోంది. దీని కారణంగా పట్టణంలో నీరంతా నిలిచిపోతోంది. పై నుంచి వచ్చిన వరదనీరు వల్ల పట్టణంలోని నీరు కాలువలోకి వెళ్లడం లేదు. దీన్ని ఆధునీకరించాలి. నీరు సజావుగా పోయేమార్గం చూడాలి. అయితే ఏటా ప్రణాళికలు ప్రతిపాదనలు అంటూ పట్టణంలో ఇదొక పెద్దఎజండాగా ఉంటుంది. ఆచరణలో ఏమీ ఉండవు. తుపాను వచ్చిందంటే పోతురాజు కాలువకు ఇరువైపులా ఉన్న కాలనీలు నీళ్లలో ఉంటాయి. మూడు దశాబ్దాలుగా ఇదే జరుగుతోంది.గుణపాఠం నేర్వకుంటే భవిష్యత్‌లోనూ ఇదే జరుగుతుంది. ఇక పంట నష్టం భారీగా ఉంది. సాగులో సగం పంటలు దెబ్బతిన్నాయి.23 వేల హెక్టార్లకుపైగా వివిధ పంటలు నీట మునిగాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం నీట మునిగిన కాలనీల్లోని పేదలకు బియ్యం ఉప్పు పప్పు ఇస్తున్నారు. పంటలు మునిగిన రైతులకు సాయం ఏమిటన్నదే ప్రశ్నార్థకంగా మారింది. మిర్చి, పత్తి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలకు తీవ్ర నష్టం జరిగింది. రహదారులు కోతకు గురయ్యాయి. రోడ్లన్నీ కొట్టుకు పోయాయి. జాతీయ రహదారుల్లోనే గుంటలు పడ్డాయి.గ్రామాలు, మండలాలకు మధ్య ఉన్న రోడ్లన్నీ ధ్వంసం మయ్యాయి. మరమ్మతులు చేపట్టాల్సిఉంది. శాఖల వారీగా నష్టాలను అంచనా వేయాల్సిఉంది. ఇపుడు ప్రాథమిక నష్టాలను అంచనా వేస్తున్నారు.ఇప్పటికైనా యంత్రాంగం కళ్లు తెరవాలి. కనువిప్పు కావాలి. ఇళ్ల వాకిళ్ళు, పొలాలు మునకకు కారణాలపై దృష్టిసారించాలి. వర్షపునీరు సజావుగా పోయేమార్గం చూడాలి.ఆటంకాలను తొలగించాలి.అపుడే భవిష్యత్‌లో ముంపు సమస్య వీడుతుంది.



అన్నిశాఖల సమన్వయంతో తుపానును

సమర్ధవంతంగా ఎదుర్కొన్నాం : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రాష్ట్ర విపత్తుల నిర్వహణ విభాగం, ముఖ్యమంత్రి ఇచ్చిన సూచనల మేరకు అన్ని ప్రభుత్వ శాఖలను జిల్లా పోలీస్ యంత్రాంగం సమన్వయం చేసుకొని జిల్లాలో ఎలాంటి ప్రాణనష్టం జరకుండా మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు ఎస్‌పి బి. ఉమామహేశ్వర్ తెలిపారు. మొంథా తుఫాన్ తీరం దాటిన తర్వాత బాపట్ల జిల్లాలో భారీ వృక్షాలు, ఈదురు గాలుల వీయడంతో చాలా ప్రాంతాల్లో సుమారు 400 వృక్షాలు నేలకొరిగాయన్నారు. జనావాస ప్రాంతాలు, వైద్యశాలలు, దేవాలయాలు, పాఠశాలలు, ప్రధాన రహదారులపై చెట్లు నేలకొరిగాయన్నారు. సమాచారం అందిన వెంటనే 30 నుంచి 40 నిమిషాల్లోనే నేలకొరిగిన చెట్లను తొలగించినట్లు తెలిపారు. బలమైన గాలులకు దెబ్బతిన్న 116 విద్యుత్ స్తంభాల వల్ల ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తొలగించినట్లు తెలిపారు. ముందస్తు చర్యలలో భాగంగా క్రెయిన్, కటర్స్, తాళ్లు పోలీస్ స్టేషన్లలో సిద్ధంగా ఉంచడం వల్ల స్తంభాలను వేగంగా తొలగించినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో లెవల్ బ్రిడ్జిలపై వరదనీరు ప్రవహించడంచ, మరికొన్ని ప్రదేశాలలో వరదనీటి ఉధతికి రోడ్లు, బ్రిడ్జిలు దెబ్బతిన్నట్లు తెలిపారు. ఆ ప్రాంతాల్లో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాన్ తీరం దాటిన తర్వాత కూడా వాగులు, వంకలు ఉధతంగా ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు తరలించి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చిన్నగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదానికి గురైన ఇద్దరు రైల్వే ఉద్యోగులను, అద్దంకిలో విధుల నిమిత్తం వెళ్లిన ముగ్గురు మున్సిపల్ ఉద్యోగులు వారిని రక్షించడానికి వెళ్లి ప్రమాదానికి గురైన ముగ్గురిని, పర్చూరులో ప్రార్థనా మందిరంలో చిక్కుకున్న 15 మంది, ప్రమాదవశాత్తు వాగులో పడిన వ్యక్తిని జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు తమ తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రక్షించారన్నారు. మొత్తం 24 మందిని పోలీస్ సిబ్బంది రక్షించారన్నారు. ఇంకొల్లు ఎస్ఐ సమయస్ఫూర్తిగా స్పందించి తన వాహనంలో నిండు గర్భిణీని సకాలంలో వైద్యశాలలో తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆమెకు సుఖప్రసవం జరిగి కవలలకు జన్మనిచ్చిందన్నారు. 24/7 జిల్లా పోలీస్ యంత్రాంగం సమర్థవంతంగా విధులు నిర్వహించడం వల్ల ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తలేదన్నారు. నిర్విరామంగా ప్రజలకు సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని, ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.



మాట్లాడుతున్న ఎస్‌పి ఉమామహేశ్వర్